తప్పెవరిది?

చెడ్డవారి చెలిమి చేయకు, మురికినీట కాలు నిడకు, పగటి నిదుర పనికిరాదు, అంటూ బాబిగాడు నీతివాక్యాలను ఆరోగ్యసూత్రాలను ఏకంచేసి చదివేస్తున్నాడు మహాజోరుగా.

"చెడ్డవారంటే ఎవరురా? అన్నయా!" అని చిట్టి చెల్లెలు ప్రశ్న వేసింది. బాబిగాడు నోరు వెళ్లబెట్టి ఆలోచించాడు. అంతవరకూ ఆ ప్రశ్నే వాడికి తోచలేదు. ఏదో, పాఠం మరునాడు మాష్టారికి ఒప్ప చెప్పాలనే వాడి బాధ కాని, అర్థాలు, అంతర్యాలు అడుగుతే వాడికేం తెలుస్తాయి. అయినా తన పెద్దరికం నిలుపుకోవాలనే తాపత్రయంతో "గోపాలం లాటివాళ్లు" అన్నాడు.

చిట్టి, బుర్ర అడ్డంగా ఆడిస్తూ, "గోపాలం చెడ్డపిల్లాడు ఎందుకయాడు? వాడు నీకన్నా చాలా మంచివాడు. ఎప్పుడూ నాకు తాయిలం పెడుతుంటాడు. అవాళేంజరిగిందో నీకు తెలుసా? నేను పరిగెట్టూంటే పడిపోయాను. కాలుకి రక్తం కూడా వచ్చింది. అప్పుడేం... గోపాలం వాళ్లింటికి తీసుకెళ్లి మందు పెట్టి, నన్ను మన యింటిదాకా దిగబెట్టాడు. ఆ మందుసీసా పెడ్తూంటే పడి పగిలిపోయింది. వాళ్ల నాన్నగారు కొట్టారు. నా నుంచి అన్ని దెబ్బలు తిన్నా గోపాలం నా నేస్తం మానలేదు" అంది.

"నిజమే, నాకూ తెలీదు గోపాలం ఎందుకు చెడ్డపిల్లాడో మరి, అందరూ అలా అంటారు. అమ్మ కూడా చెప్పింది, "ఒరే బాబీ! వాడి జట్టు కూడకు. వాడు మంచివాడు కాదు, అని అందుకే అలా అన్నాను" అన్నాడు.

మహా, మహావాళ్లే ఈ మంచి చెడ్డల తారతమ్యాన్ని, విడదియ్యలేక చస్తూంటే, ఈ పసివాళ్లకి ఏం తెలుస్తుంది. ఏది మంచి? ఏది చెడ్డ? అని చెప్పడం అంత సులువైన పనికాదు. ఒకరికి మంచిగా తోచింది, ఇంకొకరికి చెడ్డగా తోచవచ్చు. ఈ మంచిచెడ్డలన్నవి దేశ కాలానుగుణ్యంగా మారుతుండడం మనం చూస్తున్నాము, "మహాభారత" రచన జరిగిన నాటికి ఒక స్త్రీకి ఒకరుకన్నా ఎక్కువమంది భర్తలుండడం దూష్యం కాకపోయి వుండవచ్చు. లేకుంటే ద్రౌపదికి అయిదుగురు భర్తలుండడం సంభవం కాదు. ఇటీవల వరకు ఒక పురుషునికి ఎందరైనా భార్యలుండడం నిషిద్ధం కాదు. నేడది చట్ట ప్రకారం నిషేధించబడింది.

ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే, ఏది మంచి? ఏది చెడ్డ? అన్నది కాలానుగుణ్యముగా ఎలా మారుతుందో, అలానే ఎవరు మంచి, ఎవరు చెడ్డ? అన్నది వ్యక్తులపై మనకున్న అభిప్రాయాలనుబట్టి ఒక్కొక్క పరిస్థితిలో వారి ప్రవర్తన బట్టి మారుతుంటాయి.

మంచిచెడ్డల నిష్పత్తి :

ఏ ఒక్కరూ మంచివారుగా కాని, చెడ్డవారుగా కాని జన్మించరు. మంచి చెడ్డల మేళవింపు ప్రతివారిలోనూ వుంటుంది. కాకుంటే వారు పెరిగే వాతావరణం, పెంచబడే పద్ధతిపైన ఈ మంచిచెడ్డల నిష్పత్తి కొద్దిగా మారవచ్చు. ఉదాహరణకి 4:3 పాళ్లలో మంచిచెడ్డలుంటే లోకం వారిని మంచివారంటుంది. ఆ పాళ్లు అటునుంఇ, ఇటు మారుతే చెడ్డవారంటుంది. ఆ కొద్ది వ్యత్యాసాన్ని సరిదిద్దడం అంత కష్టం కాకపోవచ్చు. కాని అందుకు ఎవ్వరూ ప్రయత్నించరు సరికదా, ఆ దృష్టిపథాన్ని ఏ పరిస్థితులలోనూ మార్చుకోనిచ్చగించరు. ఒకడు ఒక తప్పుపని చెస్తే, ఆ తప్పు వాని జీవితాంతము వరకు వెన్నాడవలసిందే. వాళ్లు ఎంతగా మారినా, సన్మార్గవర్తనులయినా, ఆ సత్యాన్ని ఒప్పుకోరు. ఏమంటే వాడు చెడ్డవాడు, అందుచే వాడు చేసే ప్రతి పని చెడ్డదే, అథమం అది చెడ్డపని కాకున్నా దాని వెనుక చెడ్డ వుద్దేశాలే వుంటాయి. ఇది వారి వాదన. ఇదేరీతిగా ఒకసారి మంచి వారు అని చలామణి అయినవారు ఎన్ని కాని పనులు చేసినా అవి వారి మంచితనపు బురఖాలో మణగిపోతాయి.

కొందగుర్తులు :

ఈ మంచిచెడ్డల నిర్ణయఫలితాలు కుటుంబాలలో స్త్రీల మధ్య అధికంగా అగుపిస్తాయి. అసలు కొందరు వ్యక్తులను వారి వ్యక్తిత్వాలతో గుణగణాలతో సంబంధం లేకుండానే చెడ్డవారిగా నిర్ణయిస్తారు. ఉ॥ అత్త, ఆడుబిడ్డ, సవతితల్లి వగయిరా, ఆ మధ్య వనితాలోకంలో ఆడుబిడ్డలపై లేచిన దుమారం చూసి నేను చాలా విచారించాను. 'ఆడుబిడ్డ' అనే పదం చెడ్డతనానికి పర్యాయపదం కాదు. ఆమె మనలాటి స్త్రీయే. ఆమెకు అత్తిల్లు, భర్త, కాపురం వుంటుంది. అందలి కష్టనిష్ఠూరాలను ఆమె కూడా అనుభవించి వుంటుంది. నిజానికి ఎక్కడో ఏకైక సంతాన విషయంలో తప్పించి మనమంతా ఆడుబిడ్డలమే. మనకి ఒక అన్న, ఒక వదిన వుంటారు. ఈ దోషం అల్లా ఆడుబిడ్డతనంలోగాక, ఎదుటవారిని అర్థం చేసుకోలేకపోవడంలో వుంది. వారు చెడ్డవారు, అని మనం ముందుగానే నిర్ణయించుకొంటే, ఆపైని వారు చేసే ఏ పని అయినా, ఏ మాట అయినా మనకి చెడ్డగానే అనిపిస్తుంది. సందేహం లేదు. అందుకే ముందుగా ఎవరిపైనా నిర్ణీత అభిప్రాయాలంటూ పెట్టుకోకూడదు.

ఇదేవిధంగా చెడ్డతనానికి పేరుబడ్డ ఇంకొక వ్యక్తి సవతితల్లి, ఈ సవతితల్లులు పెట్టే బాధలను గురించి, మనం అనేక కథలు వినివుంటాం. కాని ఇందులో సత్యం ఎంతవరకు, దాని బాధ్యులెవరు? అని ఆలోచించకుండా, సవతితల్లి కాబట్టిచెడ్డది అనడం సాహసమే అవుతుంది. సవతి తల్లి అనే పదం అవతలివ్యక్తికి బిడ్డలున్నపుడే ఏర్పడుతుంది. ఇందులో బాధ్యత కలవారు భార్య, భర్త.

ముందుగా మనం ఆలోచించవలసింది. ఆమె కూడా మనలాటి ఆడుదే. చిన్నతనంలో కన్నె పిల్లలందరిలాగే ఆమె కూడా ఎన్నో కలలు కంటుంది. అందమైనవాడు, చిన్నవాడు, భర్త కావాలనీ, బాగా డబ్బుండి కారులో, లేకుంటే కాలినడకైనా, చేయి చేయి కలుపుకొని షికార్లకి, సినిమాలకి తిరగాలనీ, ఏవో ఇలాటి కోర్కెలుండడం ఆమె తప్పు కాదుకదా?

కలలు కరిగిన రోజున :

ఆమె దురదృష్టం కానీండి, ఆర్థిక కారణాలు కానీండి, వేటివల్లనయితే నేమీ, ఆమె కోర్కెలు, కలలు అన్నీ ఎండమావులుగా మారి, ఆమె జీవనపథమే మారిపోయింది. ముగ్గురు, నలుగురు పిల్లలుకల రెండోపెళ్లి వానిని ఆమె భర్తగా స్వీకరించవలసి వచ్చింది. ఇష్టం లేకుంటే వ్యతిరేకించరాదా? అంటారు. అలా జరిగితే వెంటనే ఆమె సంఘం దృష్టిలో చెడ్డది, తల్లిదండ్రుల దృష్టిలో గయ్యాళి అవనే అవుతుంది. ఇంతకీ వ్యతిరేకించి ఆమె ఏమి చేస్తుంది? పెళ్లిపీటల మీద నుంచి లేచి రైలెక్కుతే, ఎవడో చదువుకున్నవాడు, డబ్బున్నవాడు తారసిల్లి, అమాంతంగా ప్రేమించి పెళ్లి చేసుకోడం అన్నది సినిమాలకీ, కథలకీ మాత్రమే పరిమితం అన్న విషయం మరచిపోకూడదు. ఆమెకి తలిదండ్రులను ఎదరించి నిలిచేందుకు తగిన ధనం, విద్యా లేకపోవచ్చు. ఆ రెండూ వున్నా, అందుకు వలసిన మనోధైర్యం లేకపోవచ్చు. కారణం ఏదైతేనేమి, ఆమెకి ఆ రెండో పెళ్లి వరునితో వివాహం జరిగిపోతుంది.

వివాహమయి భర్త యింటికి వెళ్లేసరికి ఆమెకి కన్పించే దృశ్యం, పెంకెతనంతో దెబ్బలాడుకుంటున్న పిల్లలూ, కన్నతల్లిని కోల్పోయి, ఆలనా పాలనా లేక అల్లాడిపోతున్న పసివాళ్లూ, జీవితంలోని మాధుర్యాన్ని కోల్పోయి జీవచ్ఛవంలా వున్న భర్త. ఇదేనా ఆమె సృష్టించుకున్న సుందర స్వప్నం? ఇదేనా ఆమె ఆశించిన స్వర్గసీమ? కాదు... కాదు... అవన్నీ గాలిమేడలై కూలిపోయాయి. అవన్నీ కలలుగానే కరిగిపోయాయి. ఇది నిత్యం!.. ఇది సత్యం... దీన్ని... ఈ నిజాన్ని తెలుసుకుని సర్దుకోవడానికి, ఆమెకి తగిన అవకాశం, పరిస్థితులూ కల్పించాలి. వీలయితే విడమరచి చెప్పాలి. కాని అలా జరుగుతున్నదా? అంటే, లేదనే చెప్పాలి.

ఇరుగు పొరుగుల శ్రద్ధ :

సవతితల్లి ఇంట్లో కాలుపెట్టగానే ఇరుగుపొరుగుల అమ్మలక్కలు ఆ వార నుంచి ఈ వారనుంచి వేయి కళ్లతో చూస్తుంటారు. ఇదంతా పిల్లలపై అభిమాన మనుకోగలరు, అలాంటిదేమీ వుండదు. ఆ పిల్లల మనసులు విరిగి, ఆమెపై సద్భావం లేకుండుట మినహా ఫలితం మరేం వుండదు.

మాతృత్వం అనేది స్త్రీకి ఒక గొప్ప అనుభూతి. మరవరాని అనుభవం. ఆమె గర్భం ధరించింది లగాయతు పుట్టబోయే బిడ్డ గురించీ, ఆ బిడ్డను సాకవలసిన పద్ధతి గురించి ఎన్నో ఆలోచించుకుంటుంది. ఆ బిడ్డ దైహికంగా తన పక్కన లేకున్నా, ఊహలతోనే ఆనందిస్తుంటుంది. నవమాసములు నిండి, బిడ్డ పుట్టేసరికి, ఆమెకి ఆ బిడ్డకి అవినాభావ అనురాగం ఏర్పడుతుంది. అంతవరకు చిన్న పిల్లలా వున్న ఆ మాతృమూర్తి ఎంతో అనుభవంగల ప్రౌఢలా ఆ బిడ్డను లాలిస్తుంది. ఇదంతా ప్రకృతి సహజం. బిడ్డ గర్భస్థుడైంది

లగాయతు స్త్రీకి శారీరకంగా, మానసికంగా అనేక మార్పులు వస్తాయి. ఆమె ప్రేమ ప్రకృతి సిద్ధంగా పరిణతి చెందుతుంది.

ఈ విధాన చూస్తే సవతితల్లి అపక్వఫలం. ఈ అనుభూతులు ఆమెకి లేవు. ఈ పరిణామాలు ఆమెలో రాలేదు. ఆ పరిస్థితులలో ఆమె పిల్లలకి కన్నతల్లిలా చెయ్యలేకపోయిందన్నా, చూడలేకపోయిందన్నా ఆ దోషం ఆమెది కాదు. ఆమెను అటువంటి పరిస్థితుల పాల్జేసినవారిదే అనాలి. ఆమె మనోభావాలు అర్థం చేసుకొని, ఆమెకి తగిన సహకారం, సానుభూతి లభించిననాడు సవతితల్లిని మన కథలలో వలె ఉగ్రరూపిణిగా గాక, స్త్రీ సహజమైన ఓర్పు, సానుభూతికల స్త్రీమూర్తిగా మనం గుర్తించగల్గుతాము. ఎవరికైనా సహనానికి ఒక హద్దంటూ వుంటుంది. కన్నతల్లి అయినా పిల్లలను బెదిరించకుండా కోపగించుకోకుండా పెంచగలదా? అప్పుడు నోరెత్తని పెద్దలు సవతి తల్లి, పిల్లల్ని అదుపులో నుంచప్రయత్నిస్తే వురిమిచూస్తారు.

నిజానికి తప్పు చేసిన వారినీ, న్యాయంగా దండించవలసినవారిని అలా వదలి, సంఘం అబలలపై దండెత్తడం అవివేకం. ద్వితీయ వివాహం చేసుకొన్న ఏ పురుషుని ప్రశ్నించినా, పిల్లలకొరకే తాను తిరిగి వివాహం చేసుకొన్నట్లు చెప్తాడు. ఇందులో నిజానిజాలు ఎలా వున్నా, అసలు ఆ ఆశయసిద్ధికి ఎంతవరకు ద్వితీయం ఉపయోగపడగలదో ఆలోచిద్దాం. ఆర్థిక స్తోమత గల వ్యక్తి, పునర్వివాహ ప్రసక్తి లేకుండానే తన పిల్లల్ని పెంచుకోగలడనడానికి సందేహం లేదు. పూర్వపు రోజులలో ఎలా వున్నా ప్రస్తుతం ధనం సాధించలేని సౌకర్యం అంటూ లేదు. తగినంత ఆర్థిక స్థోమత లేనివాడు ఇంకొక భార్యని వివాహమాడితే, ఆమెకి, పుట్టబోయే పిల్లలకి అన్యాయం చెయ్యడమే అవుతుంది. ఇంకొక విషయం, పిల్లల సంరక్షణే తమ ఆశయమైతే, అందుకు తగిన అనుభవము అర్హత గల్గిన వితంతువులను ఎందుకు వివాహమాడకూడదు? అనే ప్రశ్న బయలుదేరుతుంది. అట్టి వివాహం వల్ల తన కుటుంబ రక్షణే కాకుండా ఒక సత్కార్యం చేసినట్లవుతుందే.

నిజానికి అలాటి వివాహం అన్ని విధాలా అనుకూలంగా వుంటుంది. ఆ వచ్చే స్త్రీ కూడా కష్టసుఖాలను కొంతవరకు అనుభవించి వుండటంచేత, తన నూతన భర్త యొక్క కష్టసుఖాలను అర్థం చేసుకోగలిగి వుంటుంది. చిన్నతనపు చిలిపి కోర్కెల వత్తిడి తగ్గి, జీవనపథంలో సహచరిగా ప్రవర్తించగల్గిన ప్రౌఢత్వం అబ్బి ఉంటుంది. తన ఆశలు, ఆశయాలు అంతరించాయనుకున్న స్థితిలో చిగిర్చిన ఈ నూతన శోభ ఆమెను ఆనందపరవశురాలను చేస్తుంది. సహృదయత, కృతజ్ఞత ఇనుమడిస్తాయి. పిల్లల పెంపకంలో కూడా ఆమెకి కొంత అభ్యాసం కల్గివుంటే మరీ మంచిది. అట్టి భార్యను పొందగల్గిననాడు పురుషుడు తన గడిచిన జీవితంలోని బాధలను మరచి ముందుకి పురోగమించ అవకాశము కలుగుతుంది.

కర్త, భర్త :

"తల్లిలేనినాడు, తండ్రి పినతండ్రితో సమానం" అన్న లోకోక్తిని మనం మరచిపోదాం. ఏమంటే, తలిదండ్రులకిద్దరికీ పిల్లల ఎడగల ప్రేమానురాగాలు సమానమే. అట్టి ప్రేమ ఒక్కమారుగా తెగిపోదు. నూతన భార్య రాగానే పురుషుడు శిలామూర్తి కాలేడు. అదివరలో భార్యతో, పిల్లలతో అనుభవించిన అనుభూతులను విస్మరించలేడు. కాని అతడు అసహాయుడవుతాడు. ఒక పక్క తననే నమ్ముకొని జీవితాంతం తనతో జీవించవచ్చిన భార్య, ఇంకొక పక్క అన్యం పుణ్యం ఎరుగని పిల్లలు, వీరందరి భవిష్యత్తు తనచేత ఉంటుంది. వారి జీవితాలకు తానే వరవడి పెట్టాలి. భార్యను వెనకేసుకొచ్చి, పిల్లల్ని దండించడం ఎంత క్రూరమో, పిల్లల గురించి భార్యతో పోట్లాడడమూ అంతటిదీ అవుతుంది. ఈ పరిస్థితి కల్పించింది ఎవరు? తను... దీనికి నివారణోపాయాన్ని తానే అన్వేషించాలి. ఈ విభిన్న వ్యక్తుల మధ్య సామరస్యం. నెలకొల్పడం తన కనీసవిధి.

ఒకరిపై ఇంకొకరి అధికారం ఎల్లకాలం చెల్లుబడికాదు. నేటి పిల్లలు రేపు పెద్దలవుతారు. చిన్నతనపు లేత హృదయాలపై పడే గాయాలు మాయని మచ్చలై వాళ్లతోపాటే పెరిగి పెద్దవుతాయి.

కోపం, ద్వేషం అలా పెరిగి ఒక్కసారి వారిని తలిదండ్రులనుండి వేరుచేయగలవు. వృద్ధులయిన తలిదండ్రులపై, ఆదరం అభిమానం లేక పిల్లలున్నారంటే అది చిన్ననాడు తాము వేసిన విత్తే అన్న సంగతిని పెద్దలు మరువకూడదు. దానికి వారిని నిందించేకన్నా, ఆ పరిస్థితి కలుగకుండా ముందే జాగ్రత్తపడితే అందరికీ క్షేమకరం కాగలదని గ్రహించడం మంచిది.

సంఘోద్ధరణకి కాకున్నా తమ గృహశాంతి, పిల్లల పెంపకం మనస్సులో పెట్టుకునైనా, పునర్వివాహ ఆసక్తిగల పురుషులు వితంతువులను వివాహం చేసుకుంటే, వారికి సంఘానికీ కూడా మేలు చేసినవారు అవుతారు. అలాకాక ఇప్పటివలె చిన్నపిల్లలవైపే మొగ్గుచూపుతే, అందువలన సంభవించు దుష్ఫలితాలను, ఆ కుటుంబమంతా అనుభవించక తప్పకపోవచ్చు. మంచినే ఆశిద్దాం. పురుషులు ముందు తరాలవారికి మార్గదర్శులవుతారని నమ్ముదాం.

కథా నిలయం
శ్రీకాకుళం